ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

మంగళవారం 17 డిసెంబరు 2024



24న దిశ సమావేశం

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు సంబంధించిన దిశ సమావేశాన్ని ఈ నెల 24న కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాల అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశానికి చైర్మన్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీలు హాజరుకానున్నట్లు, కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించనున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ కార్యాలయ ఎఫ్ఎల్‌సీ వెంకటరమణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద సంవత్సరానికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. వార్షిక ప్రీమియం రూ.436తో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం కింద రూ.2 లక్షలు జీవిత బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

సిరిసిల్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలను చలి తీవ్రత వణికిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో ఎన్నడూ లేనంతగా కనిష్ఠ ఉష్ణోగ్రలు పడిపోయాయి. సోమవారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 7.5 డిగ్రీలుగా గరిష్ఠ ఉష్ణోగ్రత 32.0 డిగ్రీలుగా నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో గంభీరావుపేటలో 7.5 డిగ్రీలు, రుద్రంగి 8.9, వీర్నపల్లి 9.2, బోయినపల్లి 9.8, తంగళ్లపల్లి 9.9, చందుర్తి 10.0. కోనరావుపేట 10.2, వేములవాడ రూరల్ 10.4, ఇల్లంతకుంట 10.5, ముస్తాబాద్, వేములవాడ 10.6, ఎల్లారెడ్డిపేట 11.2, సిరిసిల్లలో 11.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రత రోజంతా ఉండడంతో జనం రోడ్లపైకి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఎంపిక పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అనుపురం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి కబడ్డీ బాల, బాలికల సెలక్షన్ టోర్నమెంట్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సింగారపు తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. అనుపురం ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9 గంటలకు టోర్నీ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే బాలురు బరువు 70 కేజీల లోపు, బాలికల బరువు 65 కేజీల లోపు ఉండాలని సూచించారు. 12 జనవరి 2005లోపు జన్మించిన వారు పోటీలకు అర్హులని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను ఈ నెల 27వ తేదీన జనగామ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం డీఈవో జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మంగళవారం చేపట్టే ధర్నాకు విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు బండి దేవమ్మ, తంగళ్లపల్లి లక్ష్మీ, వెంకటలక్ష్మీ, లింగం రాధా పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం నుంచి 20వ తేదీ వరకు సిరిసిల్ల పట్టణంలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి అజ్మీరా రాందాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 18న సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాలీబాల్, కబడ్డీ (పురుషులు, మహిళలు) పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 19న సిరిసిల్ల పట్టణం రైజింగ్ ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడా మైదనాంలో అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, యోగా, చెస్, కిక్ బాక్సింగ్, ఉషూ (పురుషులు, మహిళలు)పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో 20న జూడో, టేబుల్ టెన్నీస్, క్యారం, తెక్వాండో, కరాటే, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా విజయ్ దివస్

రుద్రంగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పిరమిడ్ ఆకృతిలో ఆనాటి సైనిక సామార్థ్యాలను వివరించారు. కరస్పాడెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకటిరెడ్డి, గంగనర్సయ్య, సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు పాల్గొన్నారు.

ఆక్వాహబ్‌పై స్పష్టత కరువు


- భూ సేకరణకే పరిమితం
- మిడ్ మానేరు వద్ద 367 ఎకరాల భూమి సిద్ధం
- గత ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ, దేశీయ సంస్థలతో ఒప్పందం
- అందుబాటులోకి వస్తే 10 వేల మందికి ఉపాధి

(ఆంధ్రజ్యోతి-సిరిసిల్ల)


జిల్లాలో ఆక్వాహబ్ ఏర్పాటు భూసేకరణకే పరిమితమైంది. శ్రీరాజ రాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు అనుసంధానంగా గత ప్రభుత్వ హయాంలో ఆక్వాహబ్ ఏర్పాటు ప్రారంభోత్సవం వరకు వెళ్లింది. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారిపోవడం వంటి పరిణామాలతో ఏర్పాటు సందిగ్ధంలో పడింది. ఆక్వాహబ్ ఏర్పాటు ప్రక్రియ మొదలవడంతో మత్స్యకారులతోపాటు జిల్లాలోని ఇతర వర్గాలకు ఉపాధి లభిస్తుందని ఆశగా ఎదురు చూశారు. కొత్త ప్రభుత్వం వచ్చి సంవత్సరం దగ్గర పడినా ఆక్వాహబ్ ఏర్పాటుపై స్పష్టత రాకపోవడంతో మత్స్యకారులు నిరాశకు గురవుతున్నారు. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్ట్‌లు జలకళను సంతరించుకున్నాయి. మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో 27.55 టీఎంసీల సామర్థ్యానికి 26.48 టీఎంసీల నీటి నిల్వ ఉంది. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌తో సిరిసిల్ల మానేరు బ్రిడ్జి, వేములవాడ మూలవాగులో 18 కిలోమీటర్ల మేరకు నీటితో కళకళలాడుతోంది. వీటికి అనుసంధానంగా ఆక్వాహబ్ ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో

మిగతా 8వ పేజీలో

అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్ట్



మిడ్ మానేరు బ్యాక్ వాటర్



శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

- స్వామివారిని దర్శించుకున్న మల్లన్న భక్తులు
- ధనుర్మాస ప్రత్యేక పూజలు

7



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు

- హైదరాబాద్ వెళ్లకుండా కట్టడి
- పోలీస్‌స్టేషన్ తరలింపు
- పూచీకత్తుపై విడుదల

8



పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

కోతుల బెడద తీరేలా..



నారు మడి చుట్టూ ఏర్పాటు చేసిన వల

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోతుల బెడద అధికమైంది. మరో వైపు పొలాల్లో వన్యప్రాణులు, పక్షులతో వరి నారు మడులు దక్కకుండాపోతున్నాయి. సాధారణ ప్రజలతోపాటు రైతులకు కంటి మీద కునుకు కరవవుతోంది. వానర మూక, వన్యప్రాణులు, పక్షుల నుంచి రక్షణకు వలను ఆధారంగా చేసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కొందరు వలను ఇళ్లపై ఏర్పాటు చేసుకున్నారు. మరో వైపు రైతులు పొలాల్లో నారు మడుల చుట్టూ వలను అమర్చారు. గ్రామంలో, పొలాల వద్ద కోతులు, వన్యప్రాణులు, పక్షుల బెడద తగ్గిందని పేర్కొంటున్నారు.



ఎల్లారెడ్డిపేటలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన వల

క్రీడలతో స్నేహభావం పెంపు

వేములవాడ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ చిలుక ప్రభాకర్ అన్నారు. హన్మాజీపేట జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. సన్మార్గంలో నడిచి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. హెచ్ఎం శ్రీకాంతరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు



పరీక్ష కేంద్రానికి పరుగున చేరుకుంటున్న అభ్యర్థి

సిరిసిల్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. సిరిసిల్ల, వేములవాడ, తంగళ్లపల్లిలో 26 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. సోమవారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ముగించారు. జిల్లాలో 7163 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 49.66 శాతం హాజరయ్యారు. 7163 మంది అభ్యర్థుల్లో 3557 మంది పరీక్షలు హాజరవగా 3606 మంది గైర్హాజరయ్యారు. సిరిసిల్ల, వేములవాడ, తంగళ్లపల్లి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు వెళ్లడానికి అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. పరీక్షల నిర్వహణను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఎస్పీ అఖిల్‌మహాజన్ పర్యవేక్షించారు.

- వేములవాడ పరిధిలోని ధార్మిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-2 పరీక్ష కేంద్రానికి రెండు నెలల పాపతో తల్లి పరీక్ష రాయడానికి వచ్చింది. నాన్నమ్మ దగ్గర ఉన్న పాప ఏడ్వడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు షెహనాజ్ పాపను ఎత్తుకొని ఆడించింది.

గ్రూప్ పరీక్షల్లో సిరిసిల్ల కవి జూకంటి..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం నిర్వహించిన రెండోపరీక్షలో సిరిసిల్లకు చెందిన ప్రముఖ కవి దాశరథి అవార్డు గ్రహీత జూకంటి జగన్నాథంకు సంబంధించి సాహితీ విభాగంలో ప్రశ్న వచ్చింది. సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న జూకంటి జగన్నాథం సాహిత్యంపై జతను గుర్తించడంలో ప్రశ్న రావడంపై కవులు హర్షం వ్యక్తం చేశారు.



పాపను ఆడిస్తున్న హోంగార్డు

అసాంఘిక శక్తులపై నిఘా తీవ్రతరం



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులపై నిఘా తీవ్రతరం చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 17 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని, సాధమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. భూ, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం న్యాయం అందించే విధంగా చూస్తామన్నారు.

ధనుర్మాసం.. ఆధ్యాత్మికం

- వైష్ణవాలయాల్లో వేడుకలు - సిరిసిల్లలో తిరుప్పావై ప్రవచనాలు
- 13న గోదారంగనాథ స్వామి కల్యాణం - ఊరూరా సంక్రాంతి శోభ



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ధనుర్మాసం ఆగమనంతో ప్రతీ ఇంటికి శోభ వస్తుంది. నాలుగు వారాలపాటు ఇళ్ల ముంగిట ముచ్చట గొలిపే ముగ్గులు, గంగిరెద్దుల సందడి, భగవతానుగ్రహానికి ఆరాధనలు, నగర సంకీర్తనలతో పల్లెలు, పట్టణాలు ఆధ్యాత్మికతను సంతరించుకుంటాయి. వైష్ణవాలయాల్లో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తారు. మార్గశిర పుష్య మాసాల మధ్య ధనుర్మాసం కొనసాగుతోంది. సోమవారం మొదలైన ధనుర్మాసం వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు కొనసాగుతుంది. మహా విష్ణువు కార్తీక శుక్ల ఏకాదశి వరకు యోగనిద్రలో ఉంటాడు. స్వామివారు నిద్ర నుంచి లేచి భక్తులను అనుగ్రహించే మాసంగా ధనుర్మాసానికి ప్రత్యేకత ఉంది. ఈ మాసంలోనే పరమపవిత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినంగా శుక్లపక్ష ఏకాదశిని జరుపుకుంటారు. ముక్కోటి ఏకాదశిగా ఉత్తరద్వార దర్శనం నుంచి స్వామివారిని దర్శించుకుంటారు. నెలరోజులూ వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. లక్ష్మీదేవితో అవతరించిన గోదాదేవిని పూజిస్తారు. వరుడి కోసం కన్యలు కాత్యాయిని వ్రతాన్ని ఆచరిస్తారు. తిరుప్పావై పాశురాలలో ఈ మాసం విశిష్టతను గోదాదేవి వివరించింది. లక్ష్మీవేంకటేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల్లో తిరుప్పావై దీపారాధనలు చేస్తారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 4.30 నుంచి ఉత్తర ద్వారా దర్శనం, 13న బోగి కల్యాణం, 14న సంక్రాంతి, 15న కనుమ నిర్వహిస్తారు. సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం తిరుప్పావై ప్రవచనాలను ప్రారంభించారు. సందుగుల వేణుమాధవాచార్యులు తిరుప్పావై ప్రవచనాలను వినిపించారు. దేవ స్థానంలో ప్రతీ రోజు ధనుర్మాస కార్యక్రమాలతోపాటు 11న కుడారై ఉత్సవం, 13న గోదారంగనాథ స్వామి కల్యాణం నిర్వహించనున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



ప్రజావాణిలో సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 16 :(ఆంధ్రజ్యోతి), ప్రజావాణికి వచ్చే దరఖాస్తుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కేంద్రంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 79 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని, త్వరితగితన పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- **మెడికల్ కళాశాల మెస్ నిర్వహణ బాధ్యతలు మాకే ఇవ్వాలి**

జిల్లాలోని మెడికల్ కళాశాల మెస్ నిర్వహిస్తున్న తమకే బాధ్యతలు అప్పగించాలని తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సంతోషి హోమ్ ఫుడ్స్ నిర్వాహకులు సునిత, రేఖ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ మరొకరికి ఇవ్వాలని చూస్తున్నారని ఆరోపించారు. మెస్‌ను నమ్ముకొని పొదుపు సంఘాల నుంచి రుణాలు తీసుకున్నామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

- **అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం ఇవ్వండి**

సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్‌పోస్టును తనకు ఇప్పించాలంటూ యెల్లె హిమశ్రీ సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందించారు. బీవైనగర్‌లోని 31వ వార్డులో అంగన్‌వాడీ పోస్టు ఖాళీగా ఉందని, తాను పోస్ట్ గ్రాడ్యూయేషన్ పూర్తిచేసి ఖాళీగా ఉన్నానని, తనకు అ పోస్టును ఇస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటుందని పేర్కొన్నారు.

- **స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి**

తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ మీడియా కో- ఆర్డినేటర్ గుగ్గిళ్ల అభినయ్‌గౌడ్ అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. బద్దెనపల్లి బస్‌స్టేజీ వద్ద ఉన్న ప్రధాన రోడ్డుపై స్పీడ్ బ్రేకర్‌లు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

నిరుద్యోగులకు అండగా..

- ఉచిత కోచింగ్ ఇస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్
- ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థుల ఎంపిక
- శిక్షణ సమయంలో అలవెన్స్‌లతోపాటు భోజన వసతి

గణేశ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రస్తుత పరిస్థితుల్లో విపరీతమైన పోటీ ఉంది. ఉద్యోగాలు సాధించాలంటే పటిష్టమైన ప్రణాళికతోపాటు అన్ని విషయాలపై సమగ్రమైన అవగాహన ఉండాలి. అవసరమైన స్టడీ మెటీరియల్‌తోపాటు అనుభవజ్ఞుల మార్గదర్శకత్వం ఉంటే ఉద్యోగం సాధించవచ్చు. వీటన్నిటిని సమకూరుస్తోంది ఎస్సీ స్టడీ సర్కిల్. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో వెలువడే పలు నోటిఫికేషన్లకు అనుగుణంగా కోర్సులను రూపొందించి ఈ సంస్థ శిక్షణ ఇస్తోంది. ఒకప్పుడు ఈ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే ప్రైవేట్ సంస్థలు ఢిల్లీ, హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లోనే ఉండేవి. ఫీజు వేలల్లో ఉండడంతోపాటు అక్కడికి వెళ్లి వసతి ఏర్పాట్లు చేసుకొని చదువుకోవడం ఖరీదైన వ్యవహారం. పేద నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో ప్రైవేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వమే స్టడీ సర్కిల్‌లను ఏర్పాటు చేసింది. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2016 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి అంబేద్కర్ స్టడీ సర్కిల్ కరీంనగర్‌లో ఏర్పాటైంది. ఇప్పటి వరకు ఈ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది 269 మంది ఉద్యోగాలను సాధించారు.



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో క్లాస్ వింటున్న విద్యార్థులు

● అర్హత:

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు డిగ్రీ పాసై కుటుంబ వార్షిక ఆదాయం మూడు లక్షల రూపాయల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులు. ఇందులో ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 15 శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్ ఉంటుంది. అభ్యర్థులు tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణను అందిస్తారు.

● వివిధ ప్రభుత్వ శాఖల్లో సాధించిన ఉద్యోగాలు

ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ తీసుకొని ఇప్పటి వరకు 269 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను సాధించారు. బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజర్/క్లర్క్-11, సబ్ ఇన్‌స్పెక్టర్/పోలీస్ కానిస్టేబుల్స్-91, ప్రభుత్వ ఉపాధ్యాయులు/డిగ్రీ, జూనియర్ కాలేజీ లెక్చరర్స్-45, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు-55, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్-6, జూనియర్ అకౌంట్ ఆఫీసర్స్-2, గ్రూప్-4లో-17, క్లర్క్ ఉద్యోగాలు-8, రైల్వే/స్టాఫ్ సెలక్షన్ కమిషన్/ఇతర విభాగాల్లో 34 మంది ఉద్యోగాలు సాధించారు.



ఎస్సీ స్టడీ సర్కిల్‌లో క్లాస్ చెబుతున్న అధ్యాపకుడు

● నిపుణులతో బోధన

ఒక బ్యాచ్‌కు గరిష్ఠంగా 100 మందికి ఐదు నెలల వ్యవధిలో ఫౌండేషన్ కోర్సులో భోజన వసతులతో కూడిన శిక్షణ ఇస్తారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, జనరల్ యాప్టిట్యూడ్, ఇంగ్లీష్ తదితర సబ్జెక్టులను నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తారు. వీటితోపాటు రోజువారీ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహిస్తారు. శిక్షణతోపాటు పుస్తకాల కొనుగోలుకు 2,500 రూపాయలతోపాటు వ్యక్తిగత అవసరాల కోసం నెలకు అమ్మాయిలకు 150, అబ్బాయిలకు 100 రూపాయలు చెల్లిస్తారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

-బండ శ్రీనివాస్, డైరెక్టర్, ఎస్సీ స్టడీ సర్కిల్



నిరుద్యోగులకు అన్ని పోటీ పరీక్షలపై అవగాహన కలిగిస్తూ ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేస్తున్నాం. వివిధ స్థాయిల్లో ఉన్న ప్రభుత్వ అధికారులను స్టడీ సర్కిల్‌కు ఆహ్వానించి విద్యార్థులకు సూచనలు ఇప్పించి ప్రేరణ కలిగిస్తున్నాం. ఆడియో, వీడియో బోధన పద్ధతుల ద్వారా నిష్ణాతులతో వివిధ అంశాలను వివరిస్తున్నాం. పోటీ పరీక్షలకు సంబంధించి మాదిరి పరీక్షలను నిర్వహించి అభ్యర్థుల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తున్నాం.

కోచింగ్ ఉపయోగపడింది

- కుమారస్వామి, గ్రూప్-4 ఉద్యోగి



నేను గ్రూప్-4 ఉద్యోగం సాధించడానికి స్టడీ సర్కిల్ కోచింగ్ చాలా ఉపయోగపడింది. పట్టణాలకు వెళ్లి డబ్బులు చెల్లించి కోచింగ్ తీసుకునే స్తోమత లేని వారికి స్టడీ సర్కిల్ ఓ వరం. కోచింగ్‌లో ఐదు నెలల సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాన్ని సాధించా. నిష్ణాతులతో కోచింగ్ ఇవ్వడంతో పుస్తకాలు, భోజన వసతి కల్పించారు.

స్టడీ సర్కిల్ ద్వారా కల సాకారమైంది

-తేజస్వి, ఎస్‌బీఐ ప్రొబేషనరీ ఆఫీసర్



ఉద్యోగాన్ని సాధించాలనే నా కల స్టడీ సర్కిల్ ద్వారా సాకారమైంది. నిపుణుల శిక్షణ, మెటీరియల్ ఉద్యోగ సాధనకు ఎంతో ఉపయోగపడింది. బలహీన వర్గాల విద్యార్థులకు ఇది ఒక వరం. స్టడీ సర్కిల్‌లో చేరిన తర్వాత ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్ ప్రిలిమినరీ పరీక్ష పాసయ్యాను. తర్వాత మెయిన్స్, ఇంటర్వ్యూ పూర్తి చేసుకొని స్టడీ సర్కిల్‌లో ఉండగానే బ్యాంక్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించా. స్టడీ సర్కిల్ వాతావరణం నాకెంతో ప్రోత్సాహాన్ని అందించింది.

దుబాయిలో బస్సు ప్రమాదం

దమ్మన్నపేట వాసి మృతి



ఎర్రయ్య (ఫైల్)

మేడిపల్లి, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): దుబాయిలో ఆదివారం రాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో జగిత్యాల జిల్లా దమ్మన్నపేట గ్రామానికి చెందిన షేర్ ఎర్రన్న(50) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన గాజుల గంగరాజంకు గాయాలైనట్లు కుటుంబీకులకు సమాచారం అందింది. వీరు ఇద్దరు పదేళ్ల క్రితం దుబాయిలో ఓ నిర్మాణ కంపనీలో కార్మికులుగా చేరారు. ఏడాదికి ఓసారి స్వగ్రామానికి వస్తూ పోతున్నారు. ఆదివారం వీరికి జీతాలు రావడంతో దర్వీస్ కంపెనీలో పని చేస్తున్న కార్మికులు దాదాపు 80 మంది వారుంటున్న ప్రాంతంలో డబ్బులను ఇంటికి పంపించే సౌకర్యం లేకపోవడంతో పాటు, నిత్యావసరాల కొనుగోలు కోసం కంపెనీ బస్సులో అందరూ కలిసి అజ్మాన్ అనే ప్రాంతానికి వచ్చి తిరుగు ప్రయాణం అయ్యారు. బస్సు ఘాటు రోడ్డు పైనుంచి లోయలో పడింది. ఈ ప్రమాదంలో ఎర్రన్నకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గంగరాజంకు గాయాలు కావడంతో ఆక్కడే ఆస్పత్రికి తరలించారు.

భూ తగాదాలతో ఘర్షణ

● ఒకరికి గాయాలు

ధర్మారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) కొంత కాలంగా ఓ కుటుంబంలో ఉన్న భూముల గొడవ చివరకు అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన మార్క శంకరయ్య, మార్క లింగయ్య అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. వారి తండ్రి మార్క మల్లయ్య పేరు మీద ఉన్న ఇల్లుకు సంబంధించి స్థలాన్ని అన్న శంకరయ్యకు తెలియకుండా తమ్ముడు లింగయ్య తన బిడ్డ పేరు మీద రిజిష్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయంలో అన్నదమ్ముల ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉండగా సోమవారం పొలం వద్ద గట్ల విషయంలో లింగయ్యకు శంకరయ్య కుమారుడికి గొడవ జరిగి శంకరయ్య కుమారుడిపై లింగయ్య చేయిచేసుకున్నాడు. గొడవ అనంతరం శంకరయ్య కొడుకు ఇంటికి వచ్చి తండ్రికి చెప్పగా, కోపోద్రేకుడైన శంకరయ్య అతని కుమారుడితో కలిసి లింగయ్యపై కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో లింగయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. కాగా తన తండ్రిని చంపాలనే ఉద్దేశంతోనే ఇద్దరు కలిసి కట్టెలతో కొట్టి తీవ్రంగా గాయపరచారని లింగయ్య కుమారుడు మార్క అజయ్ ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అజయ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎండీ సాబీర్ తెలిపారు.

18న వర్గీకరణపై బహిరంగ విచారణ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఈ నెల 18 బుధవారం రోజున ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బహిరంగ విచారణ ఉంటుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. షెడ్యూల్డు కులాల ప్రతినిధుల నుంచి ఉపకులాల వర్గీకరణ అంశంపై కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ జస్టిస్ డా.శమీం అక్తర్ వినతులు స్వీకరిస్తారని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరెపల్లికి చెందిన కోనేరు రవి(22) అనే యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. రవి చొప్పదండిలో వెల్డింగ్ పనిచేస్తూ ప్రతి రోజు ఆరెపల్లి నుంచి ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి బైక్‌పై వస్తుంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం చొప్పదండి నుంచి ఆరెపల్లికి వస్తుండగా నగునూర్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. స్థానికుల సహాయంతో రవిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఇటుకబట్టీ కార్మికుడి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద ఇటుకబట్టీలో కార్మికుడిగా పనిచేస్తున్న ఒడిశాకు చెందిన భగవాన్ జున్‌కర్(40) సోమవారం ఉదయం వైన్‌షాపు వెనుక వైపు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం వరకు ఇటుక బట్టీ వద్దనే ఉండి ఆ తరువాత ఇంటికి వెళ్లిన భగవాన్ జున్‌కర్ సోమవారం ఉదయం వైన్‌షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ జున్‌కర్ మృతిచెంది ఉండడాన్ని మద్యం షాపులో పనిచేసే వారు గుర్తించి మృతుడి సోదరుడికి సమాచారం అందించారు. మృతుడి ముక్కు, ముఖంపై గాయాలున్నాయని పోలీసులు పేర్కొన్నారు. భగవాన్ జున్‌కర్ భార్య పిల్లలు ఒడిశాలోనే ఉంటుండగా అతను ఒక్కడే ముగ్ధుంపూర్‌లో నివాసం ఉంటూ ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. మృతుడి సోదరుడు దురుబల్ జున్‌కర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్య మృతి కేసులో భర్తకు 10 ఏళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య మృతికి కారణమైన గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన భర్త కడారి రాజశేఖర్ (35)కు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గంభీరావుపేటకు చెదిన రాజశేఖర్ తన భార్య భాగ్యను అనుమానంతో డిసెంబరు 2, 2020న కొట్టాడు. ఆ దెబ్బలకు తాళలేక భాగ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ సంఘటనపై అప్పటి ఎల్లారెడ్డిపేట సీఐ బన్సీలాల్ కేసు నమోదు చేసి రాజశేఖర్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. శిక్షపడడంలో కృషి చేసిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, అప్పటి సీఐ బన్సీలాల్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించారు.

ఇద్దరు యువకుల ఆత్మహత్య



దుర్గాప్రసాద్(ఫైల్)

జూలపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన ఆసంపెల్లి దుర్గాప్రసాద్(19) అనే విద్యార్థి తన ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసంపెల్లి పోచయ్య-విజయ దంపతుల మొదటి కుమారుడైన దుర్గప్రసాద్ కరీంనగర్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో చీరెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థి మృతిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్య సమస్యతో..

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన కర్రు సతీష్(38) అనే యువకుడు ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైద్రాబాద్‌లోని లిక్కర్ గోదాంలో పనిచేస్తున్న సతీష్, మూడు నెలల క్రితం ఉద్యోగం మానేసి పెద్దంపేటలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసైన సతీష్ కాలేయం దెబ్బతిని తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. సతీష్ తీరుతో మనస్తాపానికి గురై భార్య పుట్టింటికి వెళ్లింది. అనారోగ్య సమస్యలతో మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం సాయంత్రం హైద్రాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ అరెస్టు

గంభీరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట వైన్స్ కేసులో అంతర్రాష్ట్ర దొంగను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. రెండు నెలల కిందట లింగన్నపేట శివారులోని రేణుక వైన్స్‌లో దొంగలు పడి రూ.10 వేల నగదు, ఫుల్ బాటిళ్లు ఎత్తుకెళ్లారు. ఈ కేసులో ఏ1 నర్సింలును అక్టోబరు 10న రిమాండ్‌కు తరలించారు. ఏ2 బీరప్ప హరీష్ అనే దొంగను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సొంత గ్రామంలో ఆదరణ కరువు

పిచ్చి మొక్కల మధ్య సినారె విగ్రహం



హన్మాజీపేటలో సినారె విగ్రహం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

వేములవాడ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సాహితీవేత్త సింగిరెడ్డి నారాయణరెడ్డి విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. సినారె స్వస్థలం హన్మాజీపేటలో ఏర్పాటు చేసిన విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగినా పట్టించుకోవడం లేదు. విగ్రహం వద్దకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మొక్కల తొలగింపుపై ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

స్కూటీ దగ్ధం



దగ్ధమైన స్కూటీ

వీణవంక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్బాపూర్ బస్టాండ్ వద్ద సోమవారం స్కూటీ దగ్ధమైంది. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆకతాయిలు ఎవరైనా చేశారా అనేది తెలియాల్సి ఉంది. వాహనం ఎవరిది అనే వివరాలు కూడా తెలియాల్సి ఉంది పంచాయతీ కార్యదర్శి కొండ అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అక్రమంగా బియ్యం తరలింపు

● లారీని పట్టుకున్న గ్రామస్థులు

ఓదెల, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని ఒక రైస్ మిల్ నుంచి సుద్దాలలో గల స్టేజ్ వన్ సివిల్ సప్లై కార్పొరేషన్ గోదాంకు వెళ్లాల్సిన బియ్యం లారీని దారి మళ్లించడంతో అనుమానంతో నాంసానిపల్లి గ్రామస్థులు పట్టుకుని అధికారులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి లారీ నంబర్ ఏపీ 29 టీఏ 4420 గల దానిలో 290 క్వింటాళ్ల బియ్యం లోడ్‌తో సుద్దాలలో గల పౌరసరఫరాల సంస్థ స్టేజి వన్ గోదాంనకు బియ్యాన్ని తరలించారు. ఆ బియ్యం స్టేజి-2 ద్వారా రేషన్ షాపులకు సరఫరా కావాల్సి ఉంది. అయితే ఈ బియ్యం లోడుతో ఉన్న లారీ సుద్దాలకు వెళ్లకుండా ఓదెల మండలం నాంసానిపల్లి మీదుగా ఆ మండలంలో గల ఓ రైస్ మిల్లుకు వెళుతున్నట్లు సమాచారం అందింది.



పట్టుబడిన బియ్యం లారీ

బియ్యం లారీ నాంసానిపల్లి మీదుగా వెళ్తుండడాన్ని గమనించిన హరిపురం, ఓదెలకు చెందిన ఇద్దరు యువకులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే అనుమానంతో లారీని నిలిపివేసి స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచారం ఇవ్వడంతో వారు తమ బృందంతో అక్కడికి చేరుకుని లారీలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. అలాగే లారీ డ్రైవర్ వద్ద ఉన్న వేబిల్లును కూడా పరిశీలించారు. లారీలో ఉన్న బియ్యం శాంపిల్స్ తీసి ఆ లారీని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ లారీ మండలంలోని ఓదెల, కొమిర శివారులోని ఒక రైస్ మిల్లుకు తరులుతున్నట్లు సమాచారం. సదరు మిల్లు యజమాని ఆ బియ్యాన్ని సీఎంఆర్ కింద పెట్టేందుకే అక్కడికి ఆ బియ్యంను తరలిస్తున్నట్లు సమాచారం. లారీలో ఉన్న బియ్యం శాంపిల్స్ సేకరించి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెల మృత్యువాత

మల్లాపూర్, డిసెంబరు, 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన కొత్తముక్కెర రాజన్నకు చెందిన గొర్రెలు సోమవారం అనుమానాస్పదంగా మృత్యువాత పడ్డాయి. రోజు మాదిరిగానే రాజన్న తన గొర్రెల మందను మేపేందుకు సోమవారం గ్రామ శివారులోని రైస్ మిల్లు ప్రాంతానికి తీసుకెళ్లాడు. సమీపంలో మేతమేసిన గొర్రెలలో11 మృత్యువాత పడగా మరో 25 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. వెంటనే గమనించిన రాజన్న అపస్మారక స్థితికి గురైన వాటికి వైద్యం చేయించాడు. మృత్యువాత పడ్డ గొర్రెలను పోస్టుమార్టం కోసం పశువైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం చేస్తేగాని గొర్రెల మృతికి గల కారణాలు తెలుస్తాయని వైద్యులు తెలిపారు. గొర్రెలు మృతి చెందడంతో రెండు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని రాజన్న ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



గొర్రెలను ఢీకొట్టి దగ్ధమవుతున్న ద్విచక్రవాహనం

గొర్రెలను ఢీకొట్టి ద్విచక్రవాహనం దగ్ధం

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లి స్టేజి సమీపంలో గొర్ల మంద పైకి ద్విచక్ర వాహనం దూసుకెళ్లిన సంఘటనలో ఐదు గొర్రెలు మృతి చెందగా ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంనూర్‌కు చెందిన ఐతె రాము రాయపట్నం వైపు నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో రోడ్డుపై వెళ్తున్న గొర్ల మందను అతి వేగంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఆరు గొర్రెలు మృతి చెందాయి. ద్విచక్రవాహనం అతి వేగంగా రోడ్డుపై పడడంతో మంటలు చెలరేగి వాహనం పూర్తిగా దగ్ధమైంది. వాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఏసీబీకి చిక్కిన అటవీశాఖాధికారి

● రూ. 4,500 లంచం తీసుకుంటుండగా పట్టివేత

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో సోమవారం ఏసీబీ అధికారుల వలలో అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి అఫీసొద్దీన్ చిక్కాడు. మామిడి రైతు నుంచి రూ.4,500 లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పల్లాపు నరేష్‌కు కథలాపూర్ మండలం ఇప్పపల్లి గ్రామంలో మామిడి చెట్లు ఉన్నాయి. వారం రోజుల క్రితం 4 మామిడి చెట్లను నరికి వాటిని తరలించేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా నరేష్ అటవీ శాఖాధికారి అఫీసొద్దీన్‌ను సంప్రదించగా రూ. 10 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు చేసేది లేక రూ.5 వేలు ఇచ్చి రవాణాకు అనుమతి తీసుకున్నాడు. మళ్లీ రెండోసారి కొన్ని చెట్లను నరికి తరలించేందుకు అనుమతి ఇవ్వాలని సోమవారం సదరు అధికారిని కలువగా మళ్లీ రూ.4500 డిమాండ్ చేయడంతో బాధితుడు ఇస్తానని ఒప్పుకున్నాడు. అనంతరం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తికి ఫిర్యాదు చేయడంతో ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం సాయంత్రం అఫీసొద్దీన్ అద్దె ఇంటి వద్ద బాధితుడు 4,500 లంచం ఇస్తుండగా అక్కడే ఉన్న అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి

24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన పోలీసులు

గంభీరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) దొంగతనం కేసును 24 గంటల్లో గంభీరావుపేట పోలీసులు ఛేదించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేట మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన చిందం బీరయ్య నాలుగు రోజుల క్రిందట తన కూతురు వద్దకు వెళ్లి 15న తిరిగి వచ్చే క్రమంలో మాచారెడ్డి వద్ద దిగాడు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన దుండుగుల సాయిలు అనే వ్యక్తి బీరయ్య వద్దకు వచ్చి తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని, అడవిలో పెరిగే మోతుకు ఊడుగు చెట్ల వేర్లు కావాలని నమ్మించారు. వేరే వాళ్ల చేతితో వేర్లు తెంపితే పనిచేస్తుందని నమ్మబలికి సమీప పెద్దమ్మ అడవిలోకి బీరయ్యను తీసుకెళ్లాడు. పెద్దమ్మ అడవిలో ఉన్న మోతుకు, ఊడుగు చెట్ల వద్దకు వెళ్లాక వేర్లు తెచ్చేటపుడు ఒంటిపై ఎలాంటి బంగారు. వెండి వస్తువులు ఉండరాదని బీరయ్యకు చెందిన బంగారం చెవిపోగులు, వెండి కడియాలను బలవంతంగా తీసేయించాడు. బీరయ్య చెట్ల వేర్లను తీస్తుండగా, బీరయ్యకు చెందిన బంగారు చెవి పోగులు, వెండి కడియాలను సాయిలు ఎత్తుకుని పారి పోయాడు. సంఘటనపై పోలీసులకు బాధితుడు బీరయ్య పిర్యాదు చేయడంతో చాక చక్యంగా గాలింపు చర్యలను చేపట్టి 24 గంటల వ్యవదిలో సాయిలును పట్టుకుని చెవి పోగులు, కడియాలు రికవరి చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ పోలీస్ సిబ్బంది సహకారంతో నేరస్తుడైన సాయిలు 24 గంటల్లో పట్టుకోడవంతో ఉన్నతాధికారులు అబినందించారు.



పోలీసులు రికవరీ చేసిన బంగారం చెవి పోగులు, వెండి కడియాలు

వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం పేరిట మహిళల నుంచి నగదు వసూలు చేసిన ధరావత్ రాజేష్‌నాయక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు సోమవారం తెలిపారు. పీఎంఈజీ (ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం) పథకంలో భాగంగా స్థానిక సదానంద థియేటర్ బిల్డింగ్‌ను రాజేష్ నాయక్ అద్దెకు తీసుకున్నాడు. అన్నపూర్ణ ఫుడ్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎంఈజీ సభ్యత్వం పేరిట మహిళల వద్ద రూ. 2,600 నుంచి 5,200 వరకు వసూలు చేసినట్లు సీఐ తెలిపారు. ఐడీ కార్డు, ట్రైనింగ్ ఫీజు, యానిఫాం పేరిట వసూలు చేసినట్లు తెలిపారు. హనుమాన్ నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేష్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 16: జాతీయస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ యోగాసన పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. కోయంబత్తూర్‌లో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి యోగాసన పోటీలకు కరీంనగర్ జిల్లా దేవంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు తిట్ల హర్షిత్ బాలాజీ, పురాణం దీపక్, జుట్టు అశ్విత్ ఎంపికయ్యారు. వీరితో పాటు జిల్లాకు చెందిన పి.రామకృష్ణ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా, అనిల్ కుమార్ రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్, మేనేజర్లను జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వి జనార్దన్ రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి అభినందించారు.

మానకొండూర్ పాఠశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

మానకొండూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కే. సత్యనారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కొనసాగుతున్న పదవతరగతి స్టడీ అవర్స్‌ను పరిశీలించి పూర్తి అయిన సిలబస్ పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తరగతుల గురించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

45 రోజులు.. 50 వేల సబ్‌స్క్రయిబర్స్

యూట్యూబ్... నటనపై కాస్తో కూస్తో ఆసక్తి ఉన్న వారికి ఇదొక మంచి వేదిక. లక్షల్లో పెట్టుబడులు పెట్టి తీసే చిత్రాలకన్నా చిన్న పాటి పెట్టుబడితో మారుమూల గ్రామాల్లో ఎంతో మంది షార్ట్ ఫిలిమ్స్ తీస్తూ పేరు తెచ్చుకుంటున్నారు. అంతే కాకుండా ఆర్థికంగా స్థిరపడుతున్నారు. మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన మిల్కూరి అంజయ్య ఉరఫ్ అంజిమామ కూడా తన నటనతో ఎంతో మందిని మెప్పించి అతి తక్కువ సమయంలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నాడు. మొదట గ్రామంలో చిన్న చిన్న షోలలో నటించే అంజి ఇటీవల నవంబర్‌లో సొంతంగా చానల్ ప్రారంభించాడు. తాను తీస్తున్న షోలను అందులోనే అప్‌లోడ్ చేస్తున్నాడు. కేవలం రెండు నెలల్లోనే తన చానల్‌కు 50వేల మంది సబ్‌స్క్రైబర్స్ అయ్యారు.



- యూట్యూబ్, సినిమాల్లో రాణిస్తున్న అంజిమామ
- 700లకు పైగా వీడియోలు..
- నటనా ఆసక్తి గల యువతకు ప్రోత్సాహం

మల్యాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 45 రోజులు..50 వేల మంది సబ్‌స్క్రైబర్స్. ఇదీ అంజిమామ చానల్‌కు ఉన్న ప్రత్యేకత. యూట్యూబ్ చానల్ ప్రారంభించిన చాలా రోజులకు సబ్‌స్క్రైబర్స్ సంఖ్య పెరుగుతుంది. కానీ అంజిమామ తాను ఎంచుకునే కథలతో అభిమానులను ఆ కట్టుకుని అతి తక్కువ సమయంలోనే సబ్‌స్క్రైబర్స్ సంఖ్యను పెంచుకున్నాడు. 'అంజి మామ' తన చానల్‌ను 2024 నవంబరు నెల మొదట్లో ప్రారంభించాడు. పది వీడియోలు చేయగా తొమ్మిందిటిని అప్‌లోడ్ చేశా డు. చానల్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 55,129మంది సబ్‌స్క్రైబర్స్ అయ్యారు. అంజి మామ వీడియోలకు 3.6మిలియన్లు వీక్ష ణలు వచ్చాయి. అయిదుగురు సభ్యులు గల బృందంతో చిత్రీకరిస్తున్న అంజిమామ చానల్‌లో అప్‌లోడ్ చేసిన వాటిలో 'అంజిమామ కారు, టూర్'కు 6లక్షల వీక్షణలు, 'కుండ చికెన్'కు 5లక్షలు, 'అంజిమామ అడ్డె టూర్'కు 5.5లక్షలు, 'అంకాపూర్ చికెన్'కు 3లక్షల వీక్షణలు వచ్చాయి. అన్నింటిలోనూ అంజి ఉపయోగించే ఊత పదం 'అల్లుళ్లు, కోడళ్ల, ఎం జాయ్ చేయాలిరా' అనే దాంతో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అంజి ఎక్కడ కనిపించినా అభిమానులు చుట్టుముడుతూ అభిమానాన్ని చాటుకుంటున్నారు.



చిత్రీకరణలో అంజిమామ బృందం

● మై-విలేజ్ షోలతో అంజి మామగా గుర్తింపు..

అంజి మామ యూట్యూబ్, సినిమాల్లో సహజనటనతో అందరినీ ఆకట్టుకుంటూ మన్ననలు పొందుతున్నాడు. మల్యాల మండలం లంబాడిపల్లికి చెందిన మిల్కూరి అంజయ్య తన బంధువులు గంగవ్వ, మిత్రులు, పలువురు యువకులతో కలిసి మై-విలేజిషోలో అనేక వీడియోలతో యూట్యూబర్‌గా ఆకట్టుకున్నాడు. అంజయ్య కాస్తా అంజిగా గుర్తింపు పొందాడు. వినోదం, గ్రామీణ జీవనం, కుల వృత్తులు, లైఫ్‌స్టైల్, దొంగ పోలీస్, కుటుంబనేపథ్యం లాంటి దాదాపు వివిధ రకాలకు సంబంధించి 700లకు పైగా వీడియోలతో యూట్యూబ్‌లో మంచి గుర్తింపు పొందాడు. స్థానికంగా గల ఆసక్తికర అంశాలు, విజ్ఞానం, రైతులు, కార్మికులు, అవేర్‌నెస్, లోకల్ స్క్రిప్ట్ లాంటి అనేక వీడియోలు ఏదైనా వీక్షకులను అలరించే విధంగా తీర్చిదిద్దుతూ అంజిమామ బ్రాండ్‌గా వెలుగొందుతున్నాడు. ఇటీవలే అంజిమామ తానే సొంతంగా 'అంజిమామ చానల్' ఏర్పాటు చేశాడు. షార్ట్ ఫిలిమ్స్ చేస్తూ తన చానల్‌లోనే ఆ వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నాడు.

●గ్రామంలో చిన్న షోలలో నటిస్తూ..

13ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఇరాక్ వెళ్లి వచ్చిన అంజి గ్రామంలో కొందరు చేస్తున్న షోలలో చిన్నపాటి నటన చేస్తూ అందులోనే ఇమిడిపోయాడు. ఆ షోలలో మంచి పేరు రావడంతో యూ ట్యూబ్‌లో నటించడం కొనసాగించాడు. తోటి మిత్రులతో నటించిన పాత్రలకు గుర్తింపు రావడంతో పాటు చానల్‌కు వేలల్లో సబ్‌స్క్రైబర్స్ అయ్యారు. ఆ ప్రోత్సాహంతో అంజిమామగా పేరు తెచ్చుకుని రాణిస్తున్నాడు.

● సినిమాల్లోనూ రాణింపు

అంజిమామ యూట్యూబర్‌గానే కాకుండా సినిమాలు, ఇతర అనేక ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ రాణిస్తున్నాడు. నెట్‌ఫ్లిక్స్ వెబ్‌సిరీస్‌లో రాములా., ఇంటింటి రామాయణం, మేం ఫేమస్, చరత-కామాక్షి, కేబుల్‌రెడ్డి, సోపతులు తదితర చిన్న సినిమాల్లో నటించాడు. అంజి తాను గుర్తింపు పొందడమే కాకుండా నటనపై ఆసక్తి గల యువత, చిన్నారులను ప్రోత్సహిస్తూ తన వీడియోలలో అవకాశం కల్పిస్తున్నాడు.

వైభవంగా గుంటి పెరమాండ్ల రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని గుంటి పెరమాండ్ల (కట్ట కింది తీర్థం) రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు చింత సునీల్ ఆధ్వర్యంలో వేద పండితులు ఫనీంద్ర, అరుణ్ మత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌రావు, కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, పెరుమాండ్ల సత్యనారాయణ, ఉరుమడ్ల శ్రీనివాస్, బన్న రాజేష్, ఎర్ర శంకర్, జాగిలం చిన్న భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపిస్తోంది. వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కోడె మొక్కు చెల్లింపునకు సుమారుగా మూడు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. మల్లిఖా ర్జునస్వామికి ఎంతో విశిష్టమైన షష్టిమాసం సందర్భంగా భక్తులు ముందుగా రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆల యంలో ధనుర్మాసం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యుడు ధనుర్మాసంలోకి సోమవారం ప్రవేశించడంతో ఉదయం స్వామివారితో పాటు రామచంద్రస్వామి, నారాయణమూర్తి స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పాలబోగ నైవేద్యాన్ని సమర్పించినట్లు ఆలయ అర్చకులు, ఆలయ సూపరిం టెండెంట్ తిరుపతిరావు వెల్లడించారు.



రాజన్న ఆలయం వద్ద భక్తులు



ధర్మపురిలో దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురిలో ఆలయంలో..

ధర్మపురి: దనుర్మాసోత్సవాలు ధర్మపురి క్షేత్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజున లక్ష్మీ నరసింహస్వామి, అను బంధ ఆలయాల్లో ఆలయ వేదపండితులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆల య సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెం ట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్ భక్తులు పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ 2024లో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ సోమవారం విడుదల చేశారు. ఈ ఫలితాలను శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో చూసుకోవచ్చని తెలిపారు.

పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

● మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల్లో గ్రామాల్లోని అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకుంటే ఈ నెల 27న అమరవీరుల స్తూపం వద్ద మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ తెలిపారు. సోమవారం సిరిసిల్ల పట్టణ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో జేఏసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్యతో కలసి మాట్లాడారు. మాజీ సర్పంచుల అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పల్ల రాజేశ్వర్‌రెడ్డి, కోవ లక్ష్మి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి ప్రస్తావించడంపై కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క నుంచి స్పష్టమైన హామీ రాకపోవడాన్ని వ్యతిరేకించారు. రూ.691 కోట్ల మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లింపులపై స్పష్టమైన ప్రకటన చేయకుండా దాటవేసే ధోరణిని అవలంబించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామన్నారు. సమావేశంలో మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ జిల్లా నాయకులు చాకలి రమేష్, గున్నాల లక్ష్మణ్, సిరికొండ శ్రీనివాస్, అరె మహేందర్, చిట్నేని శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు 'గుడ్డు' భారం

● పెరిగిన ధరలతో నష్టం ● బిల్లులు రాక కార్మికుల అవస్థలు

కథలాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం పెట్టే నిర్వాహకులకు కోడిగుడ్డు భారంగా మారింది. ప్రభుత్వం నిర్వాహకులకు గుడ్డుకు కేవలం రూ. 5లు ఇస్తుండగా బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం రూ. 7 ధర పలుకుతోంది. ఈ క్రమంలో వంట చేసే కార్మికులకు నష్టం ఎక్కువగా ఉంటోంది. దీంతో నిర్వాహకులు భోజనంలో కోడిగుడ్డు పెట్టడానికి వెనకంజ వేస్తున్నారు.




వంటచేస్తున్న నిర్వాహకులు

● వారానికి మూడు సార్లు...

మండలంలో 30 మండల పరిషత్ పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత, 10 జిల్లా పరిషత్, కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్‌లో సుమారు 4 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం వారంలో మూడు సార్లు కోడిగుడ్డు ఇవ్వాలనే నిబంధన విధించింది. నిర్వాహకులు అప్పులు చేసి ఉడకబెట్టిన కోడిగుడ్లను విద్యార్థులకు అందించాల్సిన దుస్థితి నెలకొంది. అసలే గత మూడు నెలలుగా బిల్లులు ప్రభుత్వం నుంచి రాక నిర్వాహకులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఇచ్చే ధర కంటే బహిరంగ మార్కెట్‌లో రు.2లు అధికంగా ఉండడంతో వచ్చే కమీషన్ కూడా పొందలేని పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. వంట గదుల్లేక కొందరు ఆరుబయటే వంటలు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న చోట నిర్వాహకులకు లాభం రాకపోగా నష్టాలతో కాలం గడుపుతున్నారు. 5 తరగతుల లోపు ఒక్కో విద్యార్థికి రు. 6లు, 9వ తరగతి స్థాయిలో రు. 9లు, పదవ తరగతి విద్యార్థులకు రు. 10ల చొప్పున కమీషన్ చెల్లిస్తున్నారు.

ప్రభుత్వమే కోడిగుడ్డు సరఫరా చేయాలి

- చెన్నవేని దశరథం, సీఐటీయు జిల్లా నాయకులు



కోడిగుడ్డు ధరలు బహిరంగ మార్కెట్‌లో కొండెక్కడంతో నిర్వాహకులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అందువల్ల ప్రభుత్వమే పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేయాలి. ప్రభుత్వం పాఠశాలల్లో వెట్టిచాకిరి చేయిస్తోంది. హెల్పర్లకు రు 3 వేలు ఇస్తామని చెప్పి అందులో వెయ్యి రూపాయలు ఇవ్వడమే లేదు. నెలల తరబడి వేతనాలు, బిల్లులు చెల్లించపోవడం దారుణం.

రోజురోజుకూ పెరుగుతున్న అప్పులు

- భారత, నిర్వాహకురాలు ఊట్‌పల్లి



అసలే చాలీచాలని కమీషన్‌తో పొగ మధ్య వంటలు చేస్తూ విద్యార్థులకు భోజనం పెడుతున్నా ప్రభుత్వాలు కనికరించడం లేదు. ఏళ్ళ తరబడి వివిధ రకాల నిరసనలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వంటకు అవసరమ్యే సరుకులు అప్పులు చేసి కిరాణాల్లో తెస్తున్నాం. మరో పక్క కోడిగుడ్డు ధరలు పెరగడంతో నష్టాలకు గురై అప్పుల్లో కూరుకు పోతున్నాం. రెగ్యులర్ చేసి న్యాయం చేయాలి.

ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్‌లో గందరగోళం

- బరిలోఉంటుందా.. లేదా?
- ఆశావహుల్లోనూ అనుమానం
- మౌనం వీడని అధిష్ఠానం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఉత్తర తెలంగాణ అంటే బీఆర్ఎస్ పార్టీకి ఊపిరై నిలిచిన ప్రాంతం. మలిదశ తెలంగాణ ఉద్యమకాలంలో తన పార్టీ ఎమ్మెల్యేలను, ఎంపీలను రాజీనామాలు చేయించి వచ్చిన ఉప ఎన్నికలను ఉద్యమంలో అస్త్రాలుగా మలుచుకున్న బీఆర్ఎస్ ఆ తర్వాత కూడా ఏ ఎన్నికలు వచ్చినా తనదే పైచేయి అన్నట్లుగా వ్యవహరించేది. ఏడాదిగా అధికారానికి దూరమైనందుకో, మరెందుకో గాని తనకు పెట్టని కోటగా ఉంటూ వస్తున్న కరీం నగర్, మెదక్, నిజామబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో జరు గుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఏమాత్రం పట్టించు కోన్నట్టు ఉంటున్నది. కాంగ్రెస్, బీజేపీ ఓటర్ల నమోదు విష యంలో, ప్రచారం విషయంలో మూడు నెలలుగా నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నాయి. బీఆర్ఎస్‌లో ఎటువంటి కదలిక లేదు.

● ఎవరికి వారుగా ఆశావహుల ప్రచారం

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ఐఎంఏ నాయకుడు డాక్టర్ బీఎన్ రావు మాత్రమే తమంత తాముగా కొంత మేరకు ఓటర్ల నమోదును చేపట్టి నియోజకవర్గ పరిధిలో తమ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగానే మొదట ప్రచారం చేసుకున్న ట్రస్మా నాయకుడు యాదగిరి శేఖర్‌రావు పార్టీ ఎటూ తేల్చని వైఖరిని చూసి ఇండిపెండెంట్‌గా రంగంలో ఉంటానని ప్రకటించారు. రవీందర్‌సింగ్, బీఎన్ రావు మాత్రం అభ్యర్థులుగా పార్టీ గుర్తించినా, లేకున్నా పోటీలో ఉండాలని నిర్ణయించుకుని ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అభ్యర్థిని రంగంలో దింపుతుందా, లేదా అన్న విషయంలో వారికి కూడా స్పష్టత లేదని ప్రచారం జరుగుతున్నది. పార్టీ అగ్రనేతలైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత పట్టభద్రుల నియోజకవర్గంలోనే ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నా ఎమ్మెల్సీ ఎన్నికలను పట్టించుకోవడం లేదు. ఈ నియోజవర్గం నుంచి బీఆర్ఎస్ మూడుసార్లు తన అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించుకున్నది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన జీవన్‌రెడ్డి గెలుపొందారు. ఆయన పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగియనుండగా ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఓటర్ల నమోదు చేపట్టి ముసాయిదా జాబితాను సిద్ధం చేసింది. రెండో విడత ఓటర్ల నమోదుకు ఇచ్చిన గడువు కూడా ఈ నెల 9తో ముగిసింది. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా నిర్వహిం చాయి. ప్రధానంగా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న అభ్య ర్థులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నమోదు కార్యక్రమాన్ని చేపట్టి మూడు లక్షల పైచిలుకు మం దిని ఓటర్లుగా చేర్పించారు.

● నియోజకవర్గంలో బలాబలాలు

నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ, ఆరు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. నాలుగు పార్లమెంట్ స్థానాల్లో, ఏడు అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్నోంది. 15 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులున్నారు. వీరిలో ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. వీరితో కలుపుకొని కాంగ్రెస్‌కు 22 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఇద్దరు ఎంపీలుఆ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. 13 మంది ఎమ్మెల్యేలు, అందులో పార్టీ అగ్రనేతలు కూడా ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నా బీఆర్ఎస్ మాత్రం ఇక్కడ అభ్యర్థిని పోటీకి నిలుపుతుందా లేదా అన్నదానిపై స్పష్టత రావడ లేదు.

● నామమాత్రంగా కార్యక్రమాలు

కాంగ్రెస్, బీజేపీ నువ్వానేనా అన్నట్లు పోటీపడుతూ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ మొక్కుబడిగా కొన్ని నిరసన కార్యక్రమాలకు పరిమితమయిందని కార్యకర్తలే అసం తృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కీలక నేతలందరూ ఈ ప్రాంతంలోనే ఉన్నా పార్టీని చురుకుగా ఉంచడంలో ఎవరూ బాధ్యత వహించడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమానికి, ఆ తర్వాత ఏర్పడిన ప్రభుత్వానికి వెన్నంటి ఉంటూ వచ్చిన ఉత్తర తెలంగాణలో పూర్వ వైభవం సాధించాలంటే ప్రస్తుతం అనుసరిస్తున్న వైఖరితో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి. ఉద్యమకాలంనాటి చైతన్యంతో పార్టీని ముందుకు నడిపే నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. తొలి నుంచి తమకు అండగా ఉంటున్న జిల్లాల్లో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పార్టీ మళ్లీ ఉత్తేజితం అవుతుందనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాలనను ప్రజాపాలన విజయోత్సవాల పేరిట కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకువెళుతోంది. ఆ పార్టీ వైఫల్యాలను ఎండగట్టేందుకు నాయకత్వం ఆశించినరీతిలో ప్రయత్నం చేయడం లేదని పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయవర్గాలు మాత్రం ఈ విషయంలో పలు ఊహాగానాలు చేస్తున్నాయి. పరిస్థితులు అనుకూలించి విజయం సాధిస్తే పరవాలేదు కానీ, ఓడిపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో దాని ప్రభావం ఉంటుందని బీఆర్ఎస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో నువ్వానేనా అన్నట్లు పోటీపడి విజయం సాధించే పరిస్థితులు ఉన్నాయా, లేవా అనే విషయంలో బీఆర్ఎస్ నాయకత్వం ఒక నిర్ణయానికి రాలేకపోతోందని తెలిసింది. అందుకే అభ్యర్థిని నిలిపే విషయాన్ని ప్రకటించకుండా ఆచీతూచి వ్యవహరిస్తున్నదని రాజకీయవర్గాలు అంటున్నాయి. ఈ విషయంలో బీఆర్ఎస్ ఏం నిర్ణయం తీసుకోబోతుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్- మానక్ పోటీలకు సోమవారం ఎంపికయ్యారు. వేములవాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు శ్రావణి, సంజన, శివ రూ.1500లతో బ్యాటరీని వినియోగించి తయారు చేసిన మందు పిచికారి డబ్బా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ముక్క శంకర్ నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లేందుకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, ఏఏపీ చైర్‌పర్సన్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, స్థానికులు సోమవారం అభినందించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో నిర్వహించిన ఖో-ఖో పోటీల్లో విద్యార్థినులు దీక్షిత, మధుప్రియ, అలేఖ్య, జాశ్విని, వర్షిని, నిహారిక, జ్యోతి ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో పీడీ రవీందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వేణుగోపాల్ రావు, లక్ష్మణ్, బాబు, శ్రీధర్, రవీందర్, ప్రేమ్‌సాగర్, వెంకటరమణ, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలి

కోనరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు ఒకటో తేదీన ఇవ్వాలని అందించాలని కోనరావుపేట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో భోజన విరామ సమయంలో జీతాలను ఒకటో తేదీన అందించాలని ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 010 పద్దు ద్వారా ప్రతీనెల వేతనాలు ఒకటో తేదీన చెల్లించాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు.

అద్దె భవనాలు.. అసౌకర్యాలు

- 11 అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు
- పట్టించుకోవాలని విజ్ఞప్తి



ఇల్లంతకుంటలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

ఇల్లంతకుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. మండలంలో 64 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా మూడు సెక్టార్లుగా విభజించారు. ఇల్లంతకుంట, పెద్ద లింగాపూర్, కందికట్కూర్ సెక్టార్ల పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు కొన్ని గ్రామాలలో పక్కా భవనాలు, మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలలో ఆవరణలో కొనసాగుతుండగా 11 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. గ్రామాలలో సరైన భవనాలు లభించక పోవడం తక్కువ అద్దె చెల్లిస్తుండడంతో వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని కేంద్రాల భవనాలు వర్షాకాలంలో ఉరుస్తున్నాయని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ముస్కానిపేట, ఇల్లంతకుంట, రేపాక, వంతడుపుల, గాలిపెల్లి గ్రామాలలో భవనాలు నిర్మించాలని నిధులు మంజూరు చేసినా అవి సరిపోక పోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పక్కా భవనాలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్‌చార్జి టీచర్లు

ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంతో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల ఖాళీలు ఏర్పడ్డాయి. మండలంలో ఎనిమిది మంది అంగన్‌వాడీ టీచర్లు, 11 మంది ఆయాలు పదవీవిరమణ పొందారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఇన్‌చార్జీ టీచర్లు కొనసాగుతున్నారు. ఇన్‌చార్జి టీచర్లు కేవలం కేంద్రాల సమాచారం ఇవ్వడానికి మాత్రమే వస్తున్నారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఆయాలు లేని కేంద్రాలలో అంగన్‌వాడీ టీచర్లే అన్ని పనులు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీలను భర్తీచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను వివరణ కోరగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ప్రభుత్వం ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలి



బీవైనగర్‌లో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో నిరుపేదలకు ప్రభుత్వాలు అందించిన ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు కల్పించాలని, మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్, సుందరయ్యనగర్, పద్మనగర్, ఇందిరానగర్, రాజీవ్ నగర్, తారకరామానగర్, గణేష్‌నగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ చేసుకునే హక్కు కల్పించాలని కోరారు. 45 సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిరుపేదలకు నివాస స్థలాల పట్టాలు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం పట్టణ అభివృద్ధి జరుగుతోందని, ఈ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. ఈ ప్రాంత వాసులకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు లేకపోవడంతో బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవడానికి వీలు లేకుండా పోతోందన్నారు. ప్రజలందరూ ఎన్నో ఏళ్ల నుంచి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని పోరాడుతున్నారన్నారు. రిజిస్ట్రేషన్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఇప్పటికే గత ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించామని, మున్సిపల్ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేసినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ధర్నాలు చేయగా అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఈ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నాయని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షను గుర్తించాలని, ఈ సమస్యను పట్టించుకోవాలని అన్నారు. రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించి రుణాలు వచ్చే విధంగా జీవో తీసుకురావాలని కోరారు. లేనిపక్షంలో అందరినీ ఐక్యం చేసి ప్రజా పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, నాయకులు సిరిమల్ల సత్యం, సందుపట్ల పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు

భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజన్నకు సమర్పించుకునే కోడెలను కబేళాలకు విక్రయించడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని, దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని ప్రెస్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి ముగురు రైతుల పేరుతో 66 కోడెలు తీసుకెళ్తే ఆలయ అధికారులు, గోశాల సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదన్నారు. రాజన్న ఆలయానికి ఏటా రూ.119 కోట్లు వస్తే అందులో రూ.22 కోట్లు కోడెల ద్వారా వస్తున్నాయన్నారు. కోడెల పోషణను విస్మరించి రైతులకు ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. 66 కోడెల్లో 28 కబేళాలకు తరలించడం బాధాకరమన్నారు. రాజన్న కోడెలు విక్రయించడంపై గీసుకొండలో ముగ్గురిపై కేసు నమోదైందన్నారు. ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంలో ఈవో తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒత్తిడిని తట్టుకోలేక ఈవో సెలవుపై వెళ్లారని ఆరోపించారు. రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.72 కోట్లకు పూజ చేసేందుకు వచ్చి సుమారుగా రూ.2 కోట్ల ఆలయ డబ్బులు కొల్లగొట్టారని, అవి ఎవరి జేబులోకి వెళ్లాయో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సీనియర్ బీఆర్ఎస్ నాయకులు తీగల రవీందర్‌గౌడ్, పొలాస నరేందర్ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, నీలం కళ్యాణిశేఖర్, నరాల శేఖర్, గోలలి మహేష్, కందుల శ్రీలతక్రాంతి నాయకులు గొస్కుల రవి, కెందె గంగాధర్, వాసాల శ్రీనివాస్, వంగల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి


సిరిసిల్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభయ్‌పాటిల్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నియోజకవర్గంలో బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి బెలగం ఎమ్మెల్యే, సిరిసిల్ల నియోజకవర్గ రాష్ట్ర సంస్థాగత ఎన్నికల అధికారి అభయ్‌పాటిల్ కోరారు. సిరిసిల్లలో సోమవారం రాత్రి భారతీయ జనతా పార్టీ సంఘటన్ పర్వ్‌లో భాగంగా నియోజకర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం బూత్‌ల వారీగా కృషి చేయాలని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయిన గోపి, రేగుల మల్లికార్జున్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకర్, సంతోష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లారెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వ రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇప్పపూల దేవేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 7వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దేవేందర్ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ మినమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్య రూ.బీమా 10లక్షల సౌకర్యం కల్పించడంతోపాటు పదవీ విరమణ సమయంలో రూ.25లక్షల బెనిఫిట్స్ మంజూరు చేయాలన్నారు. విద్యాశాఖ, ఇతర శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో వెయిటేజీ కల్పించాల న్నారు. దీక్షల్లో బుర్ర జలేందర్, జయలక్ష్మీ, నీరజ, నరేందర్, శ్రీనివాస్, దేవరాజ్, సలీం, వెంకటేష్, శ్యామల పాల్గొన్నారు.

రాజన్న కోడెలను తరలించినవారిపై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన కోడెలను కబేళాలకు తరలించేందుకు సహకరించిన ఈవోతోపాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కోడెలను గోవధశాలకు విక్రయించిన మాదాసు రాంబాబుపై కేసు నమోదు చేశారని, రాంబాబుకు సహకరించిన దేవాలయ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విచారణ కూరు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏసుక్రీస్తు మార్గంలో పయనించాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఏసు చూపిన శాంతి మార్గంలో పయనించాలని సీబీసీ సికింద్రాబాద్ పాస్టర్ ఇమ్మానుయేలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాలు సోమవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానుయేలు ప్రసంగించారు. లోక రక్షకుడు ఏసు అని అన్నారు. మానవులంతా సన్మార్గంలో ముందుకు సాగేందుకు ఏసు బోధనలు చేశారన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాల పాస్టర్లు రాజేశ్, ప్రేమ్‌కుమార్, దేవరాజు, రాజు, యోబు, క్రీస్తుదాస్, అబ్రహం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి


డీలర్లతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ప్రియదర్శిని

రుద్రంగి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా ఎరువులను డీలర్లు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రియదర్శిని అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ఫెర్టిలైజర్ షాపు యజమానులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులను అంద జేయాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి, శశిధర్, నరేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు


మాట్లాడుతున్న మాజీ సర్పంచుల ఫోరం జిల్లా కన్వీనర్ అంజయ్య

తంగళ్లపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడిస్తారనే సమాచారంతో తంగళ్లపల్లి మండలంలోని తాజా మాజీ సర్పంచులను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. మాజీ సర్పంచులు మాట్ల మధు, సురభి నవీన్‌రావు, గణప శివజ్యోతి తదితరులను పోలీసులు ఉదయమే పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. అనంతరం మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర నాయకుడు మాట్ల మధు మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా అక్రమ అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చందుర్తి : మాజీ సర్పంచుల అరెస్టు అప్రజాస్వామికమని మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ జిల్లా కన్వీనర్ దుమ్ము అంజయ్య అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని అసెంబ్లీకి వెళ్తున్నారని సోమవారం తెల్లవారుజామున మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ అంజయ్య మాట్లాడుతూ శాసనసభలో సర్పంచుల సమస్యలపై మాట్లాడిన ఎమ్మెల్యేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిల్లుల వచ్చేవరకు అన్ని రాజకీయ పార్టీల సహాయ సహకారాలు ఉండాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి సిరికొండ ప్రేమ లత-శ్రీనివాస్, చిలుక అంజిబాబు, నాయకులు అట్టపల్లి భూమయ్య, శ్రీనివాస్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాహబ్‌పై స్పష్టత కరువు

5వ పేజీ తరువాయి

మిడ్ మానేరు వద్ద ఫ్రెష్ వాటర్ ఇంటిగ్రేటెడ్ ఆక్వాహబ్ ఏర్పాటుకు హడావుడి చేసింది. దీంతోపాటు మత్స్య పరిశ్రమ అభివృద్ధితోపాటు ఫిషరీష్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదనలు కూడా ముందుకొచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 జూలైలో శంకుస్థాపన చేసే విధంగా చర్యలు చేపట్టినా ప్రక్రియ ఆగిపోయింది. కొత్త ప్రభుత్వం ఆక్వాహబ్ ఊసే ఎత్తడం లేదు.

367 ఎకరాల్లో భూ సేకరణ

జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ కేంద్రంగా ఫ్రెష్ వాటర్ ఇంటిగ్రేటెడ్ ఆక్వాహబ్ ఏర్పాటు కోసం 365 ఎకరాల్లో భూ సేకరణ చేశారు. దాదాపు 600 యూనిట్లు ఆక్వాహబ్ కోసం ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఇందుకోసం అమెరికాకు చెందిన ఫిషింగ్ సంస్థతోపాటు దేశీయ సంస్థలు ఫ్రెష్ టు హోం, ఆనందా గ్రూప్, సీపీ ఆక్వాగ్రూప్‌తో రూ.2 వేల కోట్లతో పరిశ్రమల స్థాపనకు గత ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. దీంతోపాటు టీఎస్ ఐఐసీ ద్వారా రూ.102.9 కోట్లతో అభివృద్ధి పనులు చేసేలా ప్రతిపాదనలు రూపొందించింది. మిడ్ మానేరు వద్ద ఆక్వాహబ్ ఏర్పడితే పది వేల మందికి ఉపాధి లభిస్తుందని గత ప్రభుత్వం భావించింది. ప్రభుత్వాలు మారడంతో ఆక్వాహబ్ మళ్లీ ఎప్పుడు ముందుకొస్తుందోననే ఆశతో మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ప్యాక్ చైర్మన్ తిరుపతి రెడ్డి

ఇల్లంతకుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికాభివృద్ధి చెందాలని ప్యాక్స్ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం తొమ్మిది మంది రైతులకు రూ.43.50 లక్షల దీర్ఘకాలిక రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్దే ధ్యేయంగా సహకార సంఘం పని చేస్తోందన్నారు. ఇప్పటి వరకు రూ. 15.88కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. సంఘం పరిధిలోని రైతులకు 28.74 కోట్ల రుణాలను అందించామన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించడం ద్వారా కొత్త రైతులకు ఇవ్వడం వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో చిట్టి రవీందర్‌రెడ్డి, గన్నెరం నర్సయ్య పాల్గొన్నారు.

హర్యానా గేదెలు మాకొద్దు


కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన హర్యానా గేదెలు తమకు వద్దని, నచ్చిన గేదెలు ఇప్పించాలని లబ్ధిదారులు కోరారు. సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో ప్రజావాణికి తరలివచ్చారు. వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, చందుర్తి, వేములవాడ, వేములవాడ రూరల్ మండలాలకు చెందిన 24 మంది రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రెండు గేదెల చొప్పున అందించేందుకు వారం రోజుల క్రితం హర్యాన తీసుకెళ్లారని, అక్కడ గేదెలు సరిగా లేవని పేర్కొన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు, బాబు, రత్నాకర్, రవీందర్, కొండయ్య, నర్సయ్య, రాజయ్య, రాజు, లచ్చయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల జేఏసీ కన్వీనర్‌కు సన్మానం


అంజయ్యను సన్మానిస్తున్న మాజీ సర్పంచులు

చందుర్తి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ కన్వీనర్‌గా చందుర్తి మండలం రామన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో సోమవారం చందుర్తి మండల మాజీ సర్పంచులు సన్మానించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిలుక అంజిబాబు, మ్యాకల పర్శరాములు, సిరికొండ ప్రేమలత-శ్రీనివాస్, ఏనుగులజామున- శ్రీనివాస్, నాయకులు బత్తుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌కు...

కోనరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుద్దాల అంబేద్కర్ మాల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డిని సోమవారం మండల కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారికి అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం అధ్యక్షుడు ఎర్రవెల్లి రాజయ్య, ఉపాధ్యక్షులు ఎగదండి రవీందర్, మహిపాల్, మాజీ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, బాల్‌రెడ్డి, దాసు, సంజీవ్, అశోక్, పవన్, కిషన్, బాబు, భాస్కర్, మహేందర్, ప్రసాద్, రాజు, సందీప్, చందు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలు ఇప్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో ఆర్వీఎం వస్త్రాలను తయారు చేస్తున్న కుటీర పరిశ్రమల యజమానులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలని సిరిసిల్ల కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం కన్వీనర్ గౌడ వాసు, కో- కన్వీనర్ కొండ ప్రతాప్ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆర్వీఎం వస్త్రాల తయారీకి యారన్ డిపోనుంచి నూలును 90 శాతం పెట్టుబడులు లేకుండా అందించడం హర్షనీయమన్నారు. కొద్ది రోజులుగా కుటీర పరిశ్రమల యజమానుల ఆర్థిక పరిస్థితి దీనావస్థలో ఉందన్నారు. ప్రభుత్వం పూచీకత్తు ఇస్తూ బ్యాంకు ద్వారా రుణాలను ఇప్పించాలని కోరారు. రుణాలు మంజూరు చేస్తే తమ వద్ద పని చేసే కార్మికులకు సరైన సమయంలో జీతాలను ఇచ్చే వెసులుబాటు కలుగుతుందన్నారు. కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం నాయకులు శంకర్, రవి, సుంచు ప్రకాష్, మధు, రాజు, భాస్కర్, రామస్వామి, సంజీవ్, చిప్ప నారాయణ తదితరులు పాల్గొన్నారు.